ప్రజాశక్తి

శనివారం 9 డిసెంబర్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

రైతులు అతలాకుతలం



నందివెలుగులో పంటలు పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

- తుపాను బాధిత రైతులను పరామర్శించే తీరిక ప్రభుత్వానికి లేదు
- ఫసల్ బీమాను వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది
- పరిహారం కోసం రైతులకు అండగా నిలుస్తాం
- ప్రతిపక్ష నేత చంద్రబాబు
- దెబ్బతిన్న పొలాల్లో పరిశీలన

ప్రజాశక్తి - తెనాలి

తుపానుతో రైతుల జీవితాలు అతలాకుతలమైనా వారిని పరామర్శించే తీరిక ప్రభుత్వానికి లేకుండా పోయిందని ప్రతిపక్ష నేత చంద్రబాబు అన్నారు. మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన కోసం మండలంలోని నందివెలుగు, పెదరావూరు ప్రాంతాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నందివెలుగు కూడలిలో టిడిపి, జనసేన శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. నందివెలుగు, అత్తోట రోడ్డులో నీట మునిగిన వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎకరానికి చెల్లించిన కౌలు, పెట్టుబడులు, నష్టం వివరాలను తెలుసుకున్నారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ గతంలో ఎన్నో తుపానులు సంభవించాయని వాటికి భిన్నంగా, మిచౌంగ్ తుపాను విరుచుకుపడిందని అన్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే జూలైలో కురిసిన భారీ వర్షాలకు వరి తీవ్రంగా దెబ్బతిందని, తదుపరి ఎదురైన వర్షాభావ పరిస్థితులనూ రైతులు ఎదుర్కొన్నారని చెప్పారు. అయితే ప్రస్తుతం కురిసిన వర్షాలకు 90 శాతం పంట నీటిపాలైందని, రైతుల ఆవేదన వర్ణనాతీతంగా ఉందని అన్నారు. కౌలు రైతులు ఎకరానికి రూ.25 వేలు ముందస్తు కౌలు చెల్లించి, మరో రూ.25 వేలు పెట్టుబడులు పెట్టారని చెప్పారు. అయితే ఇక్కడ మానవ తప్పిదం స్పష్టంగా కనిపిస్తోందని, పంట కాల్వలు, డ్రెయినేజీ వ్యవస్థను సరి ▶ 2లో



తెనాలిలో మండలంలో నీటిలో తేలియాడుతున్న వరి పనలు

నష్టం అంచనాలపై జాప్యం!

- 11వ తేదీ నుండి ప్రారంభించేందుకు సన్నాహాలు
- మరో పంట సాగుకు పెట్టుబడి సాయం అందేనా?
- పరిహారంపై రైతుల్లో అయోమయం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

మిచౌంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలు నష్టం అంచనాలు సోమవారం నుంచి ప్రారంభించనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. మొత్తం విస్తీర్ణంలో 35 శాతం వరకు తీవ్ర నష్టం ఉన్నట్టు గుర్తిస్తేనే సంబంధిత పంటలకు పరిహారం వస్తుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. అయితే తుపాను ముగిసి రెండు రోజులు దాటినా ఇంతవరకు నష్టం అంచనాలను రైతులు, సర్వేనెంబరు వారిగా నమోదు చేయలేదు. సోమవారం నుంచి నష్టం అంచనాలను రూపొందిస్తామని గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ▶ 2లో



అవగాహన కోసం ఏర్పాటు చేసిన ఇవిఎంను పరిశీలిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

ఇవిఎం అవగాహన కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇవిఎం) వినియోగంపై అవగాహన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఈ కేంద్రాలను ప్రారంభించినట్టు కలెక్టర్ తెలిపారు. ఇవిఎం డెమోనుస్ట్రేషన్ సెంటర్లను ఎవరైనా సందర్శించి ఓటు వేసి తాము ఏ గుర్తుకు వేశామో అదే రీతిలో నమోదు అవుతుందో లేదో తెలుసుకోవచ్చునని అన్నారు. వివిప్యాట్ స్లిప్‌లు సంబంధిత యంత్రంలో పడతాయని, ఏ గుర్తుపై బటన్ నొక్కితే ఆ గుర్తుకు ఓటు పడింది లేనిది డిస్‌ప్లే ద్వారా తెలుసుకోవచ్చు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రాలు అన్ని నియోజకవర్గాల్లో పని చేస్తాయని తెలిపారు.

దయనీయంగా రైతుల పరిస్థితి

తుపాను బాధిత రైతులకు పరిహారమివ్వాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-గుంటూరు



విలేకర్లతో మాట్లాడుతున్న పాశం రామారావు

మిచౌంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సిపిఎం ప్రతినిధుల బృందం, రైతు సంఘాల నాయకులు 15 మండలాల్లో పర్యటించి, తుపాను వల్ల దెబ్బతిన్న పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడామన్నారు. రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. జిల్లా మొత్తంగా అన్ని రకాల పంటలూ 2 లక్షల ఎకరాలు దెబ్బతిన్నాయని తెలిపారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో లక్ష ఎకరాల వరి నీట మునిగిందని, కౌలు కాకుండా ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టారని అన్నారు. తుపాను ప్రభావంతో దిగుబడి తగ్గుతుందని, అంతేకుండా తడిసిన ధాన్యానిక రేటు తెగ్గోసే ప్రమాదం ఉందని చెప్పారు. ధాన్యాన్ని నిబంధనలు సడలించి ఆర్‌బికెల ద్వారా కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మిర్చి, పత్తి, శనగ, మినుము, అరటి, కంద, పసుపు, కూరగాయలు, ఆకుకూరలు వంటి పంటలు కూడా నీట మునిగాయన్నారు. మిర్చికి రూ.1.10 లక్షలు, శనగ, మినుముకు రూ.30 వేలు, పత్తికి రూ.50 వేలు, అరటి, పసుపు పంటలకు రూ.లక్ష వరకు రైతులు పెట్టుబడులు పెట్టారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టాన్ని అధికారుల ద్వారా అంచాన వేసి ఈ-క్రాప్ బుకింగ్‌తో సంబంధం లేకుండా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వాణిజ్య పంటలకు ఎకరాకు కనీసం రూ.50 వేలు, వరికి రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రాంతాన్ని బట్టి రూ.15 వేల నుండి రూ.30 వేల వరకూ కౌలు చెల్లించారని, ఇప్పుడు పంటలు తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో వారిని ఆదుకోవాలని కోరారు. ▶ 2లో



మాట్లాడుతున్న వీసీ పి.రాజశేఖర్

స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవద్దు

- ర్యాగింగ్ రహిత యూనివర్సిటీగా ఎఎన్‌యు
- పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం ప్రత్యేక కార్యాచరణ
- ఫ్రెషర్స్‌డేలో విసి ప్రొఫెసర్ రాజశేఖర్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ర్యాగింగ్ రహిత యూనివర్సిటీగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రూపాంతరం చెందిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ అన్నారు. విద్యార్థులకు పూర్తి స్వేచ్ఛ ఉందని, అయితే దాన్ని దుర్వినియోగం చేసుకోవద్దని చెప్పారు. వర్సిటీలో నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమం- యాంటీ ర్యాగింగ్ డేను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సీనియర్లు, జూనియర్లు అనే తారతమ్యాలు లేకుండా అంతా స్నేహభావంతో మెలగాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నామని, ప్రతి హాస్టల్‌లో ప్రత్యేకంగా రీడింగ్ రూములను ఏర్పాటు చేసి అందులో ఏసీ సౌకర్యం కల్పించనున్నట్లు ▶ 2లో



ఫొటోగ్రఫీ నూతన విభాగం ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సు నూతన విభాగాన్ని వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కోర్సులో ఇప్పటికే 30 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఏడాది నిడివి గల ఈ కోర్సు చేసిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని విసి చెప్పారు. ఫొటోగ్రఫీ అనేది అభిరుచి గల కోర్సన్నారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీలో పితామహునిగా పేరుందిన ప్యారిస్‌కు చెందిన డాక్ రే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఫొటోగ్రఫీలో ఉన్న ఆధునిక టెక్నాలజీలు, ఫొటోగ్రఫీ ప్రారంభం నుంచి నేటి వరకు వచ్చిన మార్పులపై ఏర్పాటు చేసిన పోస్టర్ ఎగ్జిబిషన్‌పై విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.అనిత వివరించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్.స్వరూపారాణి, ఆర్కిటెక్చర్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దయనీయంగా రైతుల పరిస్థితి

రబీ పంటల సాగుకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొగాకు పంట కూడా నీట మునిగి మళ్లీ పంట వేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. శనగ విత్తనాలు మాత్రమే ఉచితంగా ఇస్తామని అధికారులు ప్రకటించారని, అన్ని పంటలకూ విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. పదేళ్ల నుండి పంట కాల్వలు అధునీకరణకు నిధులు కేటాయించకపోవటంతో పంట కాల్వల్లో తూటికాడ, గుర్రపుడెక్క పెరిగి, నీటి పారుదలకు ఆటంకం ఏర్పడుతోందన్నారు. ఫలితంగా చిన్న వర్షం వచ్చినా కాల్వలు పొంగి పొలాలపైకి నీరువచ్చి పైర్లు ముంపుబారిన పడుతున్నారని, ఈ పరిస్థితిలో మార్పు తేవాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు ఇ.అప్పారావు, కె.నళినీకాంత్, కె.అజయ్‌కుమార్, ఎం.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



అగ్రిగోల్డ్ బాధితుల దీక్షకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి-మంగళగిరి

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం మంగళగిరి నగరంలోని గౌతమ బుద్ధ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్షను అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రారంభించారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర లో అన్ని నియోజకవర్గాలలో పరిధిలో దీక్షలను చేస్తున్నారు. దీక్ష శిబిరాన్ని సిపిఎం నాయకులు సందర్శించి మద్దతు తెలియజేశారు. మద్దతు తెలిపిన వారిలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు, డి వెంకట్ రెడ్డి, ఎం పకీరయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ తదితరులు పాల్గొన్నారు. దీక్షలో సిపిఐ నాయకులు, అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

రైతులు అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)

చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో ఆ ప్రభావం రైతులపై పడిందని విమర్శించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చెల్లించాల్సిన ఫసల్ బీమాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఫసల్ బీమా కేవలం 16 మంది రైతులకే నమోదు కావడం ఈ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఓ రైతు 20 ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నాడని, కౌలు, పెట్టుబడి కలిపితే దాదాపు రూ.10 లక్షలు వెచ్చించినట్లు చెప్పారని, ప్రస్తుతం గింజ కూడా చేతికి రాని పరిస్థితి ఎదురైతే ఆ రైతు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రైతులపట్ల ప్రభుత్వ తీరు దారుణమన్నారు. రాష్ట్రం ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉంటే అప్పుల్లో మొదటి స్థానంలో ఉందని విమర్శించారు. 2014కు ముందు ఇన్పుట్ సబ్సిడీ ఎకరానికి రూ.10 వేలు చెల్లిస్తుంటే దానిని తన హయాంలో రూ.20 వేలకు పెంచామని, ఆ ప్రకారం ప్రస్తుతం ఎకరానికి కనీసం రూ.30 వేలైనా పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. వాస్తవానికి ముఖ్యమంత్రి ముందుగా పర్యటించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. తుపాను తీరం దాటిన ప్రాంతం ఓ వైపుంటే సిఎం పర్యటన మరోవైపు సాగుతోందని ఎద్దేవా చేశారు.

ప్రశ్నించే గొంతుకను కేసుల రూపంలో ఇబ్బంది పెట్టడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందన్నారు. 45 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఎలాంటి తప్పు చేయకపోయినా, అక్రమ కేసులు బనాయించి 52 రోజులు జైల్లో ఉంచారని చంద్రబాబు అన్నారు. అంతిమంగా తనను అంతం చేయడమే లక్ష్యంగా జగన్ దక్పథం ఉందని, ఈ నేపథ్యంలో తనకు అండగా నిలిచిన రాజకీయ పార్టీలు, ప్రజలకు కృతజ్ఞతలని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అధికారం ఉంది కదా అని విర్రవీగితే తెలంగాణ మాదిరి ఫలితాలే ఎదురవుతాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులకు అండగా నిలుస్తామని, సమిష్టిగా పరిహారం కోసం ప్రభుత్వంపై పోరాడుదామని అన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే మూడు నెలల తర్వాత ఆ పరిహారం చెల్లించే బాధ్యత తానే తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు, స్థానిక నాయకుల పాల్గొన్నారు.



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు.. స్వాగతం పలికేందుకు వచ్చిన శ్రేణులు



టిడిపి అధినేతకు ఘన స్వాగతం

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుకు తెనాలిలో ఘన స్వాగతం లభించింది. నందివెలుగు కూడలిలో టిడిపి, జనసేన నాయకులు ఉదయం ఎనిమిది గంటల నుంచి వేచి ఉన్నారు. చంద్రబాబు ఉదయం 9.30 గంటలకు నందివెలుగు వస్తున్నట్లు పార్టీ నాయకులు ప్రకటించినా ఆయన నందివెలుగు జంక్షన్‌కు చేరుకునేటప్పటికీ దాదాపు 11 గంటలైంది. ఈ నేపథ్యంలో ఆయన రాక కోసం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున వేచి ఉన్నారు. నందివెలుగు జంక్షన్లో మహిళలు ఆయనకు హారతి పట్టారు. అక్కడి నుంచి అత్తోట రోడ్డులో పొలాలు పరిశీలించిన చంద్రబాబు తిరిగి నందివెలుగు జంక్షన్, కఠెవరం, తెనాలి మీదుగా పెదరావూరు మీదుగా బాపట్ల జిల్లాలో ప్రవేశించారు. దారి పొడుగునా చంద్రబాబును చూసేందుకు, స్వాగతించేందుకు పార్టీ శ్రేణులు తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, నాయకులు వంగా సాంబిరెడ్డి, నన్నపనేని సుధాకర్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, మహమ్మద్ కుద్దూస్, టి.హరిప్రసాద్, పి.విజయ్, పి.త్రిమూర్తి, షేక్ గౌసియా బేగం, పరుచూరి రమ్య, బోయపాటి అరుణ, టి.హరిప్రసాద్, జె.మహేష్, ఎం.విజయ్ కమార్, జనసేన నాయకులు బి.రవికాంత్, దివ్వెల మధుబాబు, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

నష్టం అంచనాలపై జాప్యం!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. తుపాను బాపట్ల వద్ద తీరం దాటడంతో నష్టం ఎక్కువగా ఉంది. అధిక వర్షం, గాలులకు ఇప్పటికే గుంటూరు, పల్నాడు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. కానీ పొలాల్లోకి వెళ్లి రైతుల వారీగా, సర్వే నంబరు, గ్రామాల వారీగా నివేదికలు రూపొందించడానికి కనీసం 10 రోజులు పడుతుందని అధికారులు భావిస్తున్నారు. నష్టం తీవ్రత ఎక్కువగా ఉండటం, రైతులసంఖ్య కూడా అధికం కావడం వల్ల ప్రతి రైతు వివరాల నమోదుకు సమయం పడుతుందని అంటున్నారు. దీంతో మరో రెండు మూడు రోజుల తరువాత క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉంటుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే తుపాను వల్ల దెబ్బతిన్న పొలాలను చూసి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా కౌలు రైతులకు ఎక్కువ నష్టం జరిగింది. కౌలు రైతుల్లో చాలా మందికి ఈ-క్రాప్ బుకింగ్ నమోదు కాలేదు. వీరికి నష్ట పరిహారం ఇస్తారా? లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది. కౌలుగుర్తింపు కార్డు (సిసిఆర్‌సి) ఉండి ఈ-క్రాప్‌లో నమోదైన వారి పంటకు నష్టం జరిగితే పరిహారం వస్తుందంటున్నారు.

మరోవైపు తుపాను ప్రభావంతో దిగుబడి గణనీయంగా తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. గుంటూరు జిల్లాలో వరి, మినుము, పత్తి, శనగ పొంటలకు అపార నష్టం వాటిల్లగా పల్నాడు జిల్లాలో పత్తి, మిర్చి, శనగ, మినుము, పెసర తదితర పంటలకు నష్టం వాటిల్లింది. పెట్టుబడులు భారీగా పెట్టిన రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం ఎంత వరకు ఉపశమనం కలిగిస్తుంది? ఎంత మందికి పరిహారం అందుతుంది? అనేది గ్రామాల్లో రైతులమధ్య చర్చలు జరుగుతున్నాయి. పొలాల్లోని వరి కంకులు నీటిలో తేలియాడుతున్నాయి. పొలాల్లో నీటిని తొలగించి పంటను కోసం కుప్పవేసి తరువాత నూర్పిడి చేస్తే నూకలు వస్తాయో...రంగు మారిన బియ్యం వస్తాయో తెలియని పరిస్థితి డెల్టా ప్రాంతం లో నెలకొంది. వరి, మినుము, పెసర, శనగ పంట లకు ఎకరాకు రూ.30 వేలు, పత్తికి రూ.50 వేలు, మిర్చికి రూ.లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు తుపాను కంటిమీద కునుకులేకుండా చేసింది. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను తొలగించి రబీ పంటల సాగుకు మళ్లీ సిద్ధం కావాలన్నా ఎకరాకు కనీ సం రూ.20-30 వేలు పెట్టుబడి అవసరం. వివిధ ప్రాంతాల్లో పొగాకు నారుమళ్లు నీట మునిగి వాటిని తొలగించిమళ్లీ సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గుంటూరు ఛానల్‌కు గండి

గుంటూరు ఛానల్‌కు చాలా కాలంగా మరమ్మత్తులు జరగలేదు. తూడాకు, గుర్రపు డెక్క పెరిగిపోయి నీరు సరిగా ముందుకు పోవడం లేదు. అధికవర్షాలతో గురువారం కాల్వకు బుడంపాడు వద్ద గండిపడింది. గుంటూరు రూరల్ మండలం బుడంపాడు వద్ద డ్రెయినేజి కాల్వ వల్ల గుంటూరు ఛానల్‌కు పడిన గండినట్టు అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి శుక్రవారం పరిశీలించారు. అనంతరం పలు గ్రామాల్లో ముంపునకు గురైన పంటలను ఆయన పరిశీలించారు. వరి రైతులు తమ ఆవేదనను కలెక్టర్ వద్ద వెళ్లబోసుకున్నారు. చేతికి రావాల్సిన పంట వర్షం వల్ల నీట మునిగిందని, కౌలు, పెట్టుబడి కలిపి ఎకరానికి దాదాపు రూ.80 వేల నష్టమని వివరించారు. వరి కంకులు నీటిలో నానటం వలన మొలకలు వచ్చి సగానికి సగం కూడ దిగుబడి రాదని ఆవేదన వ్యక్తం చేశారు.

సిపిఎం నాయకునికి మాతృవియోగం

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్



సిపిఎం మండల కమిటీ సభ్యులు జొన్నల అప్పిరెడ్డి తల్లి జొన్నల సుబ్బాయమ్మ (92) శుక్రవారం మృతి చెందారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజీ, మండల కార్యదర్శి ఎన్.శివాజీ, నంబూరు శాఖ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు నివాళులర్పించారు.

స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. లక్షకు పైగా పుస్తకాలతో ఉన్న లైబ్రరీని ఉపయోగించుకోవాలని సూచించారు. విద్య ద్వారానే అన్ని రకాలుగా మార్పు సాధ్యమన్నారు. బోధనలో గాని హాస్టల్లోగాని, క్యాంపస్ పరిసరాల్లో గాని ఏదైనా సమస్య వస్తే ఆయా శాఖాధిపతులకు సమాచారం అందించాలని సూచించారు. వర్సిటీ త్వరలో నాక్ రి అక్రిడేషన్‌కు వెళ్లనుందని, ఏ డబల్ ప్లస్ వంటి అత్యున్నత స్థాయి ర్యాంకును పొందేందుకు విద్యార్థులు సహకరించాలని కోరారు. రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాద్‌మూర్తి మాట్లాడుతూ బాధ్యతయుతమైన పౌరులుగా ఎదిగేందుకు వర్సిటీ సహకరిస్తుందని, విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదిగి సమాజాభివృద్ధికి దోహదపడాలని సూచించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ మాట్లాడుతూ వర్సిటీలో అందరికీ సమాన ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆల్కలైన్ వాటర్ సదుపాయం కల్పిస్తున్న యూనివర్సిటీ ఇదే మనదేనన్నారు. ఒఎస్‌డి ప్రొఫెసర్ కె.సునీత మాట్లాడుతూ ఎఎన్‌యులో ర్యాగింగ్‌కు అవకాశం లేదని, అటువంటి కార్యకలాపాలు ఎవరు పాల్పడినా వర్సిటీ నుంచి బహిష్కరించడంతోపాటు జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. సహచర విద్యార్థులను మాటల ద్వారా గాని, శారీరకంగా గాని, మానసికంగా గాని, ఆత్మవిశ్వాసం దెబ్బతినేలా కానీ చేస్తే అవి ర్యాగింగ్ పరిధిలోకి వస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ సిహెచ్. స్వరూపారాణి, ప్రొఫెసర్ కె.గంగాధరరావు, హాస్టల్ చీఫ్ వార్డెన్లు ప్రొఫెసర్ నాగరాజు, ప్రొఫెసర్ వెంకటరత్నమ్మ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా థియేటర్ ఆర్ట్స్, టీవీ విభాగంతో పాటు పొలిటికల్ సైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్, ఎకనామిక్స్, సైకాలజీ, డాన్స్ అండ్ మ్యూజిక్ విభాగాల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ర్యాగింగ్ నిరోధం, విద్యార్థుల మధ్య స్నేహభావం, విద్యతోనే మార్పు తదితర అంశాలపై వేసిన స్కిట్లు ఆకట్టుకున్నాయి.

రూ.40 లక్షల విలువ చేసే ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో వివిధ బ్రాండెడ్ కంపెనీల మొబైల్ ఫోన్ల రికవరీ ప్రక్రియలో భాగంగా రూ.40 లక్షల విలువ చేసే సుమారు 150 వివిధ బ్రాండెడ్ కంపెనీల మొబైల్ ఫోన్లను రికవరీ చేసి సంబంధిత ఫిర్యాదు దారుల కు అందించినట్లు జిల్లా ఎస్పి ఆరీఫ్ హాఫీజ్ తెలిపారు. సెల్ ఫోన్ పోగొట్టుకున్న వారు సంబంధిత వివరాలతో ఫిర్యాదుచేస్తే వెంటనే సాంకేతిక నిపుణులు దర్యాప్తు చేసి ఫోన్లను గుర్తించి పట్టుకుంటామని తెలిపారు. ఇందుకోసం ఐటీ కోర్ టీమ్ సభ్యుల కృషిని ఆయన అభినందించి కృత జ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ఫిర్యాదుదారులకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఫోన్లను అందించారు. సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి సంబంధించిన వాట్సప్ నెంబర్ 8688831574కు ఫోను చేసి ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. సెయిర్ సిటిజన్ పోర్టల్ ద్వారా మొబైల్ పోయిన వెంటనే పోర్టల్‌లో ఫిర్యా దు చేస్తే వెంటనే ఫోన్ ఎక్కడ ఉంది గుర్తిస్తామన్నారు. మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి ఎక్కువగా మొబైల్స్ తెప్పించి సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి అప్పగించినట్లు తెలిపారు. అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సి ఐ బాల సుబ్రమణ్యం, ఆర్ఐ రాజారావు ఐ..టి కోర్ ఎస్సై శ్రీనాథ్, ఎఎస్ఐ రాందాస్ రెడ్డి, పోలీస్ సిబ్బంది కరిముల్లా, రమేష్ పాల్గొన్నారు.


రికవరీ ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పి ఆరీఫ్ హాఫీజ్

కుంచనపల్లిలో రైల్వే ఉద్యోగి హఠాన్మరణం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్


బిరుదుగడ్డ కిరణ్‌కుమార్

ఎంటిఎంసి పరిది లోని కుంచన పల్లికి చెందిన రైల్వే ఉద్యోగి, బిరుదుగడ్డ కిరణ్ కుమార్ (44) గురు వారం అర్ధరాత్రి గుండె పోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కిరణ్ కుమార్‌కు గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో చాతిలో నొప్పి రావడంతో ఆయన కుటుంబ సభ్యులు తాడేపల్లి లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే కిరణ్ కుమార్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కిరణ్ మృతి వార్త తెలుసుకున్న పలువురు గ్రామస్తులు వివిధ పార్టీ నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, పూల మాలలు వేసి నివాళు లర్పించారు. శుక్ర వారం సాయం త్రం కిరణ్ అంత్యక్రియలు జరిగాయి. నివాళులర్పించిన వారిలో టిడిపి కుంచనపల్లి గ్రామ కార్యదర్శి బి. రమేష్, వైసిపి గ్రామ నాయకులు ఎన్.డేవిడ్, బి.ప్రసాద్, సం సోను, బి.పాల్, ఎన్.కిషోర్ బాబు ఉన్నారు.

బాలికను అమ్మేందుకు యత్నం

మారణాయుధంతో రౌడీషీటర్ దాడి

ప్రజాశక్తి-తాడేపల్లి

పన్నెండేళ్ల బాలికను అమ్మే ప్రయత్నం శుక్రవారం తాడేపల్లి మదర్ థెరిస్సా కాలనీలో చోటుచేసుకుంది. ఈ క్రమంలో జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తిపై మారణాయుధంతో దాడి చేయడంతో గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం, పట్టణంలోని బైపాస్‌రోడ్డు వెంబడి ఉన్న మదర్ థెరిస్సా కాలనీలో వనపర్తి బుజ్జి అనే వ్యక్తిని విజయవాడ పటమటకు చెందిన రౌడీషీటర్ కిరణ్, స్టేషన్ ముందు అందరూ చూస్తుండగానే మారణాయుధంతో దాడి చేసి గాయపరిచి అక్కడ నుంచి పరారయ్యాడు. పోలీసులు అతన్ని పట్టుకునేందుకు విఫలయత్నం చేశారు. విజయవాడ రాజరాజేశ్వరిపేటకు చెందిన బుజ్జికి బావ వరస అయిన బాలసాని తిరుపతిరావు పోలీసులకు సహకరిస్తున్నాడనే అనే అనుమానం పెంచుకున్నాడు. ఆటో డ్రైవర్ తిరుపతిరావు, మదర్ థెరిస్సా కాలనీలో నివాసముంటున్న తన ప్రియురాలు బుజ్జితో కలిసి విజయవాడ నుంచి ఆటోలో వస్తున్నారన్న సమాచారం రావడంతో కిరణ్ కూడా ఆ కాలనీకి చేరుకున్నాడు.



మాట్లాడుతున్న సిఐ, దాడిలో రక్తపు మరకలు

ఈ క్రమంలో తిరుపతిరావుపై దాడి చేసి కత్తితో వీపుపై, పొట్టపై గాయపరిచాడు. తిరుపతిరావును స్థానికులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విజయవాడ పటమట పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్‌గా ఉన్న కిరణ్ గతంలో చదువుకున్న మహిళలతో పాటు కొంత మందిపై ఈ విధంగానే దాడి చేసినట్లు విశ్వసనీయ సమాచారం. బుజ్జి కుమార్తెను అమ్మే ప్రయత్నంలో శుక్రవారం బుజ్జి, కిరణ్‌కు వివాదం ఏర్పడింది. బుజ్జిని చంపి బాలికను తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆటోడ్రైవర్ తిరుపతిరావుపై జరిగిన దాడిపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కోటమ్మకు సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు వేముల దుర్గారావు భార్య వేముల కోటమ్మకు షుగర్ వ్యాధి కారణంగా ఇటీవల వైద్యులు ఆపరేషన్ చేసి కుడి కాలు మోకాలి వరకు తొలగించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్చి అయి కృష్ణానగర్‌లోని ఇంటి వచ్చిన కోటమ్మను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, ఎస్‌కె పీరూ సాహెబ్, డి.విజయబాబు, ఎల్.ఆచారి, శ్రీనివాసరావు పరామర్శించారు.

శివాలయంలో పాలకమండలి సమావేశం

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్



శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో ధర్మకర్త మండలి సమావేశం శుక్రవారం ఆలయ చైర్మన్ అమ్మి శెట్టి శివ శంకరరావు అధ్యక్షతన నిర్వహించారు. శివాలయంలో భక్తులకు కల్పించాల్సిన వసతులపై చర్చించి తీర్మానించినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎ. శ్రీనివాసరెడ్డి తెలిపారు. పాలక మండల సభ్యులు పాల్గొన్నారు.

బిఎల్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - మేడికొండూరు


మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి రవీంద్రరావు

బిఎల్వోలు ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.ఆర్.ఆర్.సి తాడికొండ నియోజకవర్గ ఎన్నికల అధికారి రవీంద్రరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం నందు శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల బిఎల్‌ఒలతో ప్రత్యేక సమావేశం జరిగింది. మేడికొండూరు తహశీల్దార్ శ్రీనివాస శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రవీంద్రరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని, కొత్తగా పొందే ఓటు హక్కు గడువు పూర్తి కానున్నట్లు చెప్పారు. మండలంలో కొన్ని అనివార్య కారణాల వలన చనిపోయిన వ్యక్తుల యొక్క ఓట్లను తీసివేయాలని,ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరికి ఇంటి నెంబరు సరిగా ఉందో లేదో అధికారులు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని చెప్పారు.ఓటు హక్కు విషయంలో ప్రజలకు ఎప్పటి కప్పుడు అందుబాటులో ఉండాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

ఓటు హక్కు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, అటువంటి అధికారులపై చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడపోనని రవీంద్రరావు హెచ్చరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ దివ్య పంచాయతీ అధికారులు,రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి- మేడికొండూరు


పంచాయతి సెక్రటరీలకు క్రికెట్ కిట్లను పంపిణీ చేస్తున్న కత్తెర సురేష్ కుమార్

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం అందరిదీ అని, యువత భవితకు బంగారు బాట వేయటానికి ముఖ మంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారని, తాడికొండ నియోజకవర్గ సమ న్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మేడ ి కొండూరులో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని స్పోర్ట్స్ కిట్టును పంపిణీ చేశారు.

సైబర్ క్రైమ్ ఇంటర్నెట్ సేఫ్‌పై అవగాహన

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

మండల కేంద్రమైన పద:కాన్ని జడ్పీ హైస్కూల్ నందు శుక్రవారం మంగళగిరి గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ సిస్టర్ లత ఆధ్వర్యంలో సైబర్ నాలెడ్జ్ పై ఆహ్వాన సదస్సు నిర్వహించారు.నేటి కాలంలో ప్రతి ఒక్కరూ ఫోన్ వాడకం దినచర్యలో భాగం అయిందని, 100 మంది బాలికలకు సెల్ ఫోన్లు ఏ విధంగా వాడాలని తెలియజేశారు. కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

చర్మకారుల సమస్యలపై మంత్రి నాగార్జునకు వినతి

ప్రజాశక్తి-మంగళగిరి

గుంటూరులోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ను శుక్రవారం ఆయన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ చర్మకార సంక్షేమ సంఘం అధ్యక్షులు బుల్లా రాజారావు, సంఘం నాయకులు కలిసి చర్మకారుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మంగళగిరి నియోజకవర్గంలోని మాదిగ చర్మకారులు, డప్పు కళాకారులకు వనరబుల్ పథకం కింద 250 మందికి లక్ష రూపాయలు చొప్పున రుణం మంజూరు చేయాలని తదితర సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గార్లపాటి దాస్, సంఘం నాయకులు దున్నా నాగయ్య, కే పావని, ఎన్ ప్రశాంతి పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ పుట్టినరోజున అన్నదానం

ప్రజాశక్తి-మంగళగిరి

అమరావతి జెఎసి తెలుగు మహిళా నాయకురాలు, మంగళగిరి పట్టణ మాజీ కౌన్సిలర్ మన్యం అరుణ 50వ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం అన్నదానం నిర్వహిం చారు. అన్న క్యాంటీన్, శ్రీకృష్ణ వద్దా చైతన్య ఆశ్రమంలో మన్యం శ్రీని వాస్ ఆధ్వ ర్యంలో అన్నదానం నిర్వహించారు. అనం తరం మైనార్టీ కార్యకర్త చిన్నిషా కు కంటి ఆపరేషన్ నిమిత్తం రూ 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

తుపాను బాధితులకు చెక్కులు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మిచాంగ్ తుఫాను కారణంగా పొన్నూరు మండలంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు పొన్నూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే కిలారి రోశయ్య తక్షణ సహాయం కింద చెక్కులు పంపిణీ చేశారు. రోశయ్య మాట్లాడుతూ నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 29,279
మిర్చి ఎగుమతి	: 31,494
మిర్చి నిల్వ	: 12,587

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 23,500
నెం.5	10,000 - 20,000
273	14,000 - 20,000
341	10,000 - 22,000
నాన్ ఎసి	
తేజ	8,500 - 24,000
బడిగి	11,000 - 24,000
దేవనూరు డీలక్స్	10,000 - 19,000
తాలుకాయలు	5,500 - 13,000
ఎసి	
334	10,500 - 21,000
నెం.5	15,000 - 15,000
273	17,500 - 17,500
341	11,500 - 18,500
తేజ	10,000 - 23,800
బడిగి	10,000 - 23,200
దేవనూరు డీలక్స్	11,000 - 17,000
తాలుకాయలు	6,300 -12,000



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లిలో శ్రీవిద్య హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీవిద్య హాస్పిటల్‌ను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యులు కాట్రాజు చిరంజీవి, టి.నాగశ్రీవిద్య మాట్లాడుతూ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో మెరుగైన వైద్య సేవలను అందిస్తామని చెప్పారు. సత్తెనపల్లి పట్టణంలోని మొట్టమొదటిగా డిజిటల్ ఎక్సరే, సియామ్ మిషన్‌లతో అత్యాధునికమైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ బత్తుల శివరామకృష్ణయ్య, డాక్టర్ జెట్టి శ్రీనివాసరావు, డాక్టర్ గాలి వెంకటరావు, డాక్టర్ పోట్ల అరుణకుమారి, డాక్టర్ నాగోతు ప్రకాష్, డాక్టర్ బిఎస్ఎస్ వెంకటేశ్వర్లు, డాక్టర్ యలవర్తి వరబాబు, డాక్టర్ గడ్డం వెంకటేశ్వర్లు, డాక్టర్ జి.శ్రీధర్, డాక్టర్ పి.శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ షకీలా శ్రీధర్ దంపతులు, డాక్టర్ సిహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డాక్టర్ వెంకటేశ్వరరావు, రామచంద్రప్రసాద్ తదితరులు

చంద్రబాబు సభకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటకు ఈ నెలలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో సభాస్థలిని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ, డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎన్.రామచంద్రప్రసాద్ తదితరులు శుక్రవారం పరిశీలించారు. అరవిందబాబు మాట్లాడుతూ పల్నాడు గడ్డపై ఈసారి టిడిపి జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. నాలుగున్నరేళ్లుగా వైసిపి చేస్తున్న దగా, ద్రోహాన్ని ఎండగట్టడమే లక్ష్యంగా ప్రజల్లోకి చంద్రబాబు వస్తున్నారని అన్నారు. ప్రజాక్షేత్రంలో చంద్రబాబు తిరగకుండా చేసేందుకు కుట్రలు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాబోయే ఎన్నికలలో ఓడిపోవడం తథ్యమన్నారు. డాక్టర్ వెంకటేశ్వరరావు, రామచంద్రప్రసాద్ మాట్లాడుతూ దగాకోరు ప్రభుత్వంపై దండెత్తేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని, వచ్చే ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.బ్రహ్మయ్య, వి.సింహాద్రి యాదవ్, కె.కోటిసుబ్బారావు, జి.జనార్ధన్‌బాబు, తెలుగు యువత పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.కోటిరెడ్డి, సిహెచ్ బాలు, కె.సంజీవరావు పాల్గొన్నారు.

ప్రగల్భాలు పలికిన పంటల బీమా ఎక్కడ?

- రబీ పంటలను ఇప్పటికీ ఈ-క్రాప్ చేయని ప్రభుత్వం
- సత్వరమే నష్టపరిహారం అంచనాలు వేసి బాధిత రైతుల జాబితాను ప్రకటించాలి
- పెరిగిన ధరలు, పెట్టుబడుల ఆధారంగా ఇన్‌పుట్ సబ్సిడీని పెంచాలి : కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ
- తుపానుకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన కౌలురైతు సంఘం, సిపిఎం నాయకులు



నరుకుళ్లపాడు వాగు సమీపంలోని పొలంలో దెబ్బతిన్న మినుము పైరును చూపుతున్న నాయకులు.. పెదమద్దూరు వాగు సమీపంలో దెబ్బతిన్న పుల్ల శనగ పైరు

ప్రజాశక్తి-అమరావతి

నష్టం వాటిల్లిన పంట ఫొటో తీసి పెట్టిన వెంటనే 25 శాతం బీమా పరిహారాన్ని చెల్లిస్తామని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో చెప్పారని, అదెక్కడ అమలు చేస్తున్నారని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ ప్రశ్నించారు. ఫసల్ బీమాలో కంపెనీలకు చెల్లించాల్సిన 1.5 శాతం ప్రీమియాన్ని తామే చెల్లిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చెల్లించలేదని నిలదీశారు. తుపాను నేపథ్యంలో దెబ్బతిన్న పొలాలను కౌలురైతు సంఘం, సిపిఎం నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ అమరావతి మండలంలోని ఎండ్రాయి, నరుకుళ్లపాడు, పెదమద్దూరు తదితర గ్రామాల్లో వాగులు పొంగిపొర్లడంతో రబీలో వేసిన కంది 350 ఎకరాలు, మినుము 70 ఎకరాలు, శనగ 1500 ఎకరాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రబీ పంటలను ప్రభుత్వం ఇప్పటికీ ఈ-క్రాప్‌లో నమోదు చేయలేదని అన్నారు. దెబ్బతిన్న పంటలన్నింటినీ సత్వరమే అంచనా వేసి ఆర్‌బికెలు, సచివాలయాల వద్ద బాధిత రైతుల జాబితాను ప్రదర్శించాలని, జాబితాలో నమోదవ్వని రైతుల విన్నపాలను పరిగణలోకి తీసుకొని రైతుల సమక్షంలో పంటపొలాలను సందర్శించి నష్టాన్ని గుర్తించాలని డిమాండ్ చేశారు. వాస్తవ సాగుదార్లయిన కౌలురైతులకే పరిహారం దక్కేలా చూడాలన్నారు. 13 ఏళ్ల కిందట నిర్ణయించిన ఇన్పుట్ సబ్సిడీని కాకుండా పెరిగిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు, సేద్యం ఖర్చులను పరిగణలోకి తీసుకొని పంట నష్ట పరిహారాన్ని పెంచాలని కోరారు. బీమా పరిహారానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, అన్ని పంటలకు దిగుబడుల ఆధారిత పంటల బీమాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొద్దిపాటి వర్షాలకు కూడా వాగులు పొంగి పంట పొలాలను దెబ్బతీస్తున్నాయని, వాగుల పరీవాహక ప్రాంతంలో చెట్లను తొలగించి, కల్వర్టులను పెంచి వాగు ప్రవాహం త్వరితగతిన వెళ్లే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాని అన్నారు. కరువుతో రబీలో వేసిన పంటలను రక్షించుకోవడానికి నీటి కోసం అష్ట కష్టాలు పడిన రైతులు, పంట చేతికి వచ్చే తరుణంలో వచ్చిన తుపాను వల్ల తీవ్రంగా దెబ్బతిన్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వమే రైతులను అన్ని విధాలా ఆదుకుని అండగా నిలవాలని కోరారు. కౌలురైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారని, పంట పూర్తిగా నష్టపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నవారికి రుణమాఫీ చేయాలని కోరారు. పరిశీలనలో సిపిఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు, మొహిద్దిన్‌వలి, రఫీ, నవీను, రాజు ఉన్నారు.

ప్రతిరైతునూ ప్రభుత్వం ఆదుకుంటుంది : మంత్రి రజిని



మిర్చి పొలాన్ని పరిశీలిస్తున్న మంత్రి రజిని

ప్రజాశక్తి - నాదెండ్ల

తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పొలాలను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని శుక్రవారం పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. మండలంలోని తూబాడు, బుక్కాపురం గ్రామాల్లో పర్యటించిన మంత్రి మిర్చి, పత్తి, శనగ పొలాలు దెబ్బతినగా వాటిని పరిశీలించి రైతుల నుండి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పంట నష్టపోయిన ప్రతిరైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని, ఏ ఒక్క రైతు ఆందోళనకు గురవ్వాల్సిన పనిలేదని అన్నారు. పరిశీలనలో అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రైతులెవ్వరూ అధైర్య పడొద్దు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పంటలు నష్టపోయిన రైతులెవ్వరూ అధైర్య పడొద్దని, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. నరసరావుపేట మండలంలోని పమిడిమర్రు, కొండకావూరు, ఉప్పలపాడు, దొండపాడు గ్రామాల్లో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, శనగ, పత్తి, మిర్చి పొలాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. బాధిత రైతులందరికీ పరిహారం దక్కేలా సిఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. నష్ట అంచనాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్‌లు డి.సుధారాణి శ్రీనివాసరావు, జె.లక్ష్మీ వెంకటేశ్వరరెడ్డి, వి.నాగిరెడ్డి, ఎంపిపి ఎం.శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి పి.చిట్టిబాబు, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, తహశీల్దార్ రమణ నాయక్, ఏవో వి.నరేంద్రబాబు ఉన్నారు.





కొండకావురులో నేలవాలిన అరటితోటను, పమిడిమర్రులో మిర్చి తోటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

పంటలను కాపాడుకోడానికి ఇలా చేయండి



మిర్చిపంటపై రైతులకు సలహాలు సూచనలు చేస్తున్న డాట్ సెంటర్ శాస్త్రవేత్త వరప్రసాద్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తుపాను ప్రభావానికి గురైన పంటలను కాపాడుకునేందుకు రైతులు సమగ్ర యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం (డాట్ సెంటర్) ప్రధాన శాస్త్రవేత్త, సమన్వయకర్త డాక్టర్ సిహెచ్ వరప్రసాద్ సూచించారు. నరసరావుపేట మండలంలోని పమిడిపాడులో మిర్చి, మొక్కజొన్న, కంది, శన, మినుము పొలాలను ఆయన శుక్రవారం పరిశీలించడంతోపాటు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. మిర్చిపైరు పూత, కాయ దశలో ఉందని, వేరుకుళ్లుడు, కొమ్మ ఎండు తెగుళు ఆశించే అవకాశం ఉందని చెప్పారు. నివారణకు కార్బండిజం 2 గ్రాములు లేదా కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లు బాగా తడిసేలా ద్రావకాన్ని పోయాలని సూచించారు. కొమ్మ ఎండు తెగులు లక్షణాలు కనిపిస్తే హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటర్లు లేదా అజాక్స్ స్ట్రోబిన్ 2.5 మిల్లీగ్రాములు కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. మినుములో వర్షాకాలం తరువాత ఇనుప ధాతులోపం ఆశిస్తుందని నివారణకు అన్నభేది 5 గ్రాములు, నిమ్మ ఉప్పు ఒక మిల్లీ గ్రామును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలని తెలిపారు. మొక్కజొన్నలో ఎండు తెగులు రాకుండా లీటర్ నీటికి ప్రొపికొనజోల్ ఒక మిల్లీ లీటరు లేదా హెక్సాకోణాజోల్ 2 మిల్లీ లీటర్లు నీటిలో కలిపి పిచికారి చేయాలని వివరించారు. పొలంలో నీరంతా పోయాక వీలైతే అంతర్ సేద్యం చేసుకుని 15 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు. మిరి, మినుము పైరుల్లో తెల్ల దోమలు ఉధృతి గమనిస్తే ఎకరాకు థయోమిథాక్సా 40 గ్రాములు లేదా ఎస్టామిప్రైడ్ 40 గ్రాములను లీటరు నీటికి బాగా కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సాయకులు అశోక్, రైతులు పాల్గొన్నారు.

కొండవీటివాగు ఉధృతికి నీటమునిగిన పంటలు

ప్రజాశక్తి - తుళ్లూరు

తాడికొండ, మంగళగిరి నియోజక వర్గాల రైతాంగానికి దుంఖదాయినిగా పేరొందిన కొండవీటివాగు ఉధృతికి పంటపొలాలు, కూరగాయల తోటలు నీట మునిగిపోయాయి. చేలు చెరువులను తలపిస్తున్నాయి. కొండవీటి వాగు పోటెత్తడంతో కోట్లాది రూపాయిల పంట నష్టం వాటిల్లింది. మిచాంగ్ తుపాన్ కారణంగా కొండవీటి వాగు ఉప్పొంగిన కారణంగా తాడికొండ, తుళ్లూరు, మంగళగిరి నియోజక వర్గాల పరిధిలో పంట నష్టం వాటిల్లింది. నీరు ముందుకు ప్రవహించే వీలులేక పోవడంతో పత్తి, మిర్చి, మినుము, పుల్ల శెనగ తదితర పంటలు ఉరకెత్తు తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం కొండవీటి వాగు కారణంగా సుమారు 13 వేల ఎకరాల పంట నష్టం జరిగినట్లు అంచనా. దశాబ్దాలుగా తుపాన్ లు, అధిక వర్షాలతో కొండవీటి వాగు పొంగి పంటలను ముంచెత్తుతోంది. పెదపరిమిలోని కోటేళ్ళ వాగు, చీకటి వాగు, నీరుకొండ వాగు, తాడికొండ మండలం లోని కంతేరు - తాడికొండ మధ్య ఎర్ర వాగులు పొంగడం వల్ల పంట నష్టంతో పాటు వాగులు పొంగి ప్రాణ నష్టం, రవాణా వ్యవస్థ న్_ ం బి. ం చ్ డ్ ం జరుగుతోంది. పంట నష్టం జరిగినప్పుడు అధికారులు, ప్రభుత్వం నామమాత్రంగా పంట నష్ట పరిహారం ఇచ్చి చేతులు దులుపు కుంటున్నారని రైతులు మండిపడుతున్నారు. కొన్ని సార్లు నష్ట పరిహారం దక్కడం లేదని రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో కొండవీటి వాగు వరద నీటిని కృష్ణా పశ్చిమ డెల్టా కాలువ లోకి పంపడానికి ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టింది. పథకం వినియోగంలోకి రాకపోవడంతో పథకం వల్ల ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు వాపో తున్నారు.



కొండవీటి వాగు ఉధృతికి నీట మునిగిన పంట పొలాలు

కోతకు వచ్చే సమయంలో తుపాను ముంచింది

ఎన్ శ్రీనివాసరావు, రైతు, నీరుకొండ



ఐదెకరాలు బీర సాగు చేశాను. కాపు కోతకొచ్చే సమయంలో తుపాను రావడంతో కొండవీటి వాగు పొంగిపొర్లింది. దీనివల్ల పెద్ద ఎత్తున నీరు పొలంలోకి చేరింది. నీరు పారుదల లేకపోవడంతో కాసిన బీర పంట పాడైపోయింది. ఎకరానికి రూ.50వేల నుండి 60వేల వరకు నష్టం జరిగింది. అధికారులుకానీ, ప్రజాప్రతినిధులు కానీ పొలం వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వం సాయాం చేసి ఆదుకోవాలి.

పంట నష్టంపై రేపటి నుండి అంచనాలు

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి - తెనాలి, కొల్లిపర

జిల్లాలో మిచాంగ్ తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకునేలా చర్యలు తీసుకుంటున్నామని, 10వ తేదీ నుండి పంట నష్టంపై ఎన్యుమరేషన్ ప్రారంభిస్తామనిజిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, తెనాలి శాసనసభ్యులు అన్నబత్తుని శివకుమార్, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ తో కలసి తెనాలి, కొల్లిపర మండలాల్లో మిచాంగ్ తుపాను వలన కురిసిన భారీ వర్షాలు వలన నీట మునిగిన పంటలను పరిశీలించారు. తొలుత గుంటూరు రూరల్ మండలం పరిధిలోని బుడంపాడు వద్ద డ్రైనేజి కాలువ వలన గుంటూరు ఛానల్‌కు పడిన గండి మరమ్మతుపనులను పరిశీలించారు. తెనాలి మండలంలో పెదరావూరు, చినరావూరు, బుర్రిపాలెం, కొల్లిపర మండలం చక్రయపాలెం, జముడుపాలెం, దావులూరు, గ్రామాల్లో నీరు నిలిచిన వరి పొలాలను, తూములూరులో పడిపోయిన అరటి పొలాలను జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి పరిశీలించి రైతులతో మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం లక్ష ఎకరాల్లోని వరి పంట, 20వేల ఎకరాల్లోని మినుము, శెనగ తదితర పంటలు, 26 వేల ఎకరాల్లోని మిరప, అరటి, కాయగూరలు వంటి ఉద్యాన పంటలకు నష్టం జరిగిందన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరుపున పూర్తి సహాయ సహకారాలు అందించి ఆదుకుంటామని, నమోదు చేసిన పంట నష్టం వివరాలను ఆర్‌బికెల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఎక్కువుగా కౌలు రైతులు నష్టపోయారని, నష్టపరిహారం వారికే అందేలా భూయాజమానులు మానత్వంతో సహకరించాలన్నారు. అధికారులు అధికారులు పోలాలు వద్ద కు వచ్చి నష్ట పరిహారాన్ని నమోదు చేస్తారన్నారు. ఇప్పటికే కోతలు జరిగిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతు చేతికి వచ్చిన పంట నీట మునిగిందని, కౌలుకు సాగు చేయటం వలన కౌలు, పెట్టుబడి కలిపి ఎకరానికి దాదాపు రూ.80,000 వరకు నష్టం వచ్చిందన్నారు. వరి కంకులు నీటిలో నానటం వలన మొలకలు వచ్చి సగానికి సగం కూడ దిగుబడి రాదని ఆవేదన వ్యక్తం చేశారు. పొలంలో ఉన్న నీటిని వేగవంతంగా తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నరావూరు వద్ద రైల్వే స్థలంలో డ్రైనేజీ కాల్వ ఉండటం వలన రైల్వే శాఖ అనుమతి లేక కాలువ పూడిక తీయటం కుదరక పోలాల్లో వర్షానికి నీరు చేరు తుందని తెలిపారు. గతంలో ఇక్కడ ఉన్న రైల్వే గేటును మూసివేయటం ద్వారా రైతులు వాహనాలు పోలాలు వద్దకు రాకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రైతులు తెలిపిన అంశాలపై జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి డివిజన్ రైల్వే మేనేజరుతో ఫోన్ లో మాట్లడి డ్రైనేజీ కాలువ పూడకతీత పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో డిసెంబరు 3,4వ తేదీలలో జిల్లాలో 36 గంటలు భారీ వర్షం కురవటం వలన పంటలకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. పొలాల్లో చేరిన నీటిని యుద్ధప్రాతిపదికన వెలుపలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ప్రత్తిపాడు, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో ఎక్కువుగాను, మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో కొంతమేర పంటలకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేయటం జరిగిందన్నారు. డ్రైనేజీ అడ్డంకుల వలన ఇప్పటికీ పోలాల్లో నిలిచిన నీటిని వెంటనే వెలుపలకు పంపించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో రైతుల సూచనల మేరకు డ్రైనేజీల పూడికతీత, అడ్డంకులు తొలగించేందుకు అదనంగా అవసరం మేరకు ఉపాధి హామీ కూలీలను, మిషన్లను సమకూర్చాలని డ్వామా పీడీ, ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ శివరామిరెడ్డి, కొల్లిపర ఎంపీడీవో విజయలక్ష్మీ, తెనాలి తహశీల్దారు రవిబాబు, కొల్లిపర తహశీల్దారు నాంచరయ్య, తెనాలి ఎంపీపీ ధర్మరాజు చెన్నకేశవులు, ఇరిగేషన్, పంచాయితీ రాజ్,వ్యవసాయశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గోన్నారు.



వరి పంట పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు



నీటమునిగిన వరి పొలం

20వ డివిజన్‌లో సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు :నగర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గం, 20వ డివిజన్‌లోని పీకలవాగు కట్టపై రూ.20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి స్థానిక ప్రజలతో కలిసి శంఖుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇప్పటికే సదరు ప్రాంతంలోని ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఇంటి పన్నులు వేయించామని, అంతేకాక తాగునీటి పైప్‌లైన్లు కూడా వేయించామన్నారు. నగరంలో అన్ని వార్డులలో అభివృద్ధి పనులు కుల మత మరియు పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గేదెల నాగరంగమణి రమేష్, 20వ డివిజన్ వైసిపి అధ్యక్షులు కంతేటి శ్యామ్ శేఖర్, ఖాజా మొహిద్దిన్, జిఎంసి అధికారులు పాల్గొన్నారు.

13న మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-గుంటూరు: స్థానిక గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజిలో ఈనెల 13న ఉదయం 9 గంటల నుండి డిప్లొమా ఇన్ ఫార్మసీ కోర్సులలో మిగిలిన సీట్లను భర్తీ చేయటానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బైపిసి, ఎంపిసి విద్యార్థినులు రెగ్యులర్‌గానీ, కంపార్ట్‌మెంట్‌లోగానీ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తుకు అర్హులని తెలిపారు. అలాగే ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ బైపిసి, ఎంపిసి చదివిన విద్యార్థినులూ అర్హులేనని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఓరిజనల్ సర్టిఫికెట్లు, రెండు జతల జిరాక్స్ కాపీలతో, రూ.6300ల ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చన్నారు. కళాశాల ప్రాంగణంలో వసతి గృహ సదుపాయం కూడా ఉందన్నారు. స్పాట్ అడ్మిషన్లలో సీటు పొందే అభ్యర్థులకు ఎలాంటి ఫీజు రాయితీ, స్కాలర్‌షిప్‌లు ఉండవని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ సదుపాయాన్ని విద్యార్థినులు వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న బైరగాని శ్రీనివాసరావు

కౌలు రైతులకు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

తుపాను వలన నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. గుంటూరు జిల్లా కౌలు రైతుల విస్తృత సమావేశం మన్నవ నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన బ్రాడీపేటలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు.శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనందువల్లే రైతులు ఎక్కువగా నష్టపోయారని ఆయన తెలిపారు. మిర్చి, శనగ, పొగాకు, అరటి వంటి పంటలు కూడా అధికంగా దెబ్బతిన్నాయన్నారు.12వ తేదీ నుండి నష్టాన్ని అంచనా వేస్తామని కలెక్టర్ తెలిపారన్నారు. అయితే వాస్తవ సాగుదారులైన కౌలు రైతుల పేర్లే నమోదు చేయాలని కోరారు. భూ యజమానులు ఒప్పుకోక పోవడంతో చాలామందికి కౌలు గుర్తింపు కార్డులు రాలేదన్నారు. కావున పరిహారం కౌలు రైతులకే అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే రుణాలు అందక, అధిక వడ్డీలకు ప్రైవేటు వడ్డీలు తెచ్చి అప్పుల పాలయ్యారని, ఇప్పుడు పరిహారం కూడా ఇవ్వకపోతే మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతారని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే ఆందోళన చేపడతామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ తుఫాన్ వల్ల వ్యవసాయ కార్మికులకు పని లేకుండా పోయిందని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు బొట్ల రామకష్ణ, పల్లెకష్ణ, భీమవరపు అమ్మిరెడ్డి, వై నాగేశ్వరరావు, కే.శ్రీనివాసరావు, ఎన్.రామచంద్రరావు, వి.సురేష్ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్

ప్రజాశక్తి-గుంటూరు



రక్తదాతను అభినందిస్తున్న తులసి ధర్మచరణ్

అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరు ఏదోక సమయంలో రక్తం దానం చేయడం వలన ప్రాణదాతలుగా నిలుస్తారని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అన్నారు. శుక్రవారం స్థానిక లక్ష్మీపురం హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకులో వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి రోహిణి కుమార్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి తులసి ధర్మచరణ్ ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భ ంగా ధర్మచరణ్ మాట్లాడుతూ హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్ వారు ప్రతి ఏడాది డిసెంబర్ 8వ తేదీన రక్తదాన శిబిరం నిర్వహించటం, సేకరిం చిన రక్తాన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు అభినందనీయం అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి, ఆపదలో ఉన్న వారిని ఆదు కోవాలని కోరారు.కార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటి వైస్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ బి.అరుణ్‌కుమార్, పి.యువటూరి, మేనేజర్ బి.వెంకటరామారావు పాల్గొన్నారు.

పంచాయతీల పరిపాలనపై కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు :



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఆదినారాయణరావు

స్థానిక గుంటూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం గ్రామ పంచాయతీ పరిపాలన విధానం, పంచాయతీ సొంత ఆదాయ వనరులు అనే అంశాలపై మండల పరిధిలోని పంచాయితీ కార్యదర్శులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం నుండి నిరంజన్‌రావు, గొర్లవారి పాలెం పంచాయతీ కార్యదర్శి ఎం.వి.రమణయ్య హాజరై కార్యదర్శులకు ఆయా అంశాలపై శిక్షణ ఇచ్చారు. తొలుత శిక్షణను ఎంపిడిఒ ఎస్.ఆదినారాయణరావు ప్రారంభించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి-అచ్చంపేట

స్థానిక జడ్పిహెచ్ హై స్కూల్‌లో దివంగత ప్రధానోపాధ్యాయుడు ముప్పాళ్ళ గోపాలకృష్ణ శత జయంతి ముగింపు వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ కుమారులు ముప్పాళ్ళ వెంకటేశ్వరరావు ,కుటుంబ సభ్యులు పాఠశాలలోని గ్రంథాలయానికి రూ.20 వేలు విలువ చేసే పుస్తకాలను అందజేశారు ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్ఎం సిహెచ్ కళ్యాణి మాట్లాడుతూ 50 మందితో ప్రారంభమైన పాఠశాలలో నేడు 1100 మందికి పైగా విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు. ఆనాడు గ్రామంలోని పలువురు పెద్దలు సహకారంతో ఏర్పాటైన తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేడు ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిందని, వారిలో చాలా మంది విదేశాలలో ఉన్నత స్థాయిలో ఉన్నట్లు చెప్పారు. పూర్వ ఈ పాఠశాలకు మౌలిక వసతుల కల్పన నిమిత్త సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.



నిమ్మగడ్డ లక్ష్మీ ప్రసాద్‌కు నివాళి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల శ్రీ సత్యసాయి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నిమ్మగడ్డ లక్ష్మీ ప్రసాద్ 2 వ వర్ధంతి కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ సత్యసాయి విద్యా విహార్ లోని నిమ్మగడ్డ లక్ష్మీ ప్రసాద్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు, సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ అక్కినేని అనిల్ మాట్లాడుతూ నిమ్మగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాచర్ల పట్టణంలో సత్యసాయి సేవా సమితిని ఏర్పాటుచేసి ఎన్నో సేవా కార్యక్రమాలను చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి,సత్య సాయి విద్యా విహార్ ప్రిన్సిపల్ వై.రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ మధురవాణి, డాక్టర్ బంగా లక్ష్మీప్రసన్న, నిమ్మగడ్డ సురేఖ పాల్గొన్నారు.



అంగన్వాడీ అభివృద్ధి కమిటీలకు శిక్షణ

ప్రజాశక్తి-యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని పిఆర్ విజ్ఞాన కేంద్రంలో అంగన్‌వాడీ నాడు-నేడు ఫేజ్ 2 అభివృద్ధి కమిటీల శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ శిక్షణలో పంచాయతిరాజ్ డిఇఇ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి కేంద్రంలోనూ తాగు నీరు, మరుగుదొడ్డి, విద్యుత్, గోడలపై ఆకర్షణీయమైన బొమ్మలతో కూడిన చిత్రాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కమిటీలదేనని చెప్పారు. కార్యక్రమంలో సొలస, యడ్లపాడు సెక్టార్ల ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఎం.జోజమ్మ, కె.వెంకటరమణ, అంగన్‌వాడీ తల్లుల కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అవకతవకలకు తావివ్వొద్దు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఓటర్ల నమోదు, మృతుల ఓట్ల తొలగింపులు, డబల్ ఎంట్రీల తొలగింపులు పారదర్శకంగా జరగాలని మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది, బిఎల్వోలను ఓటరు నమోదు అధికారి అయిన ఆర్‌డిఒ ఎం.శేషిరెడ్డి ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ అతిథి గృహం, రొంపిచర్ల తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షించారు. ఫామ్ 6, అర్జీలు విచారణ విధానం, నోటీసుల జారీ తదితర అంశాలను డివిజనల్ పరిపాలన అధికారి చంద్రారెడ్డి వివరించారు. ఓటర్ల జాబితా తయారీలో అవకతవకలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్షలో నరసరావుపేట, రొంపిచర్ల తహశీల్దార్లు రమణ నాయక్, బి.అంకారావు పాల్గొన్నారు.



నరసరావుపేటలో సమావేశంలో పాల్గొన్న ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్

నష్టం అంచనాకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ బృందాలు

ప్రజాశక్తి-ఈపూరు

మిచాంగ్ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటల పరిశీలనకు రెవిన్యూ, ఆర్బికే సిబ్బంది బృందాలుగా ఏర్పడి పంట నష్టం అంచనా వేయనున్నట్లు తహశీల్దార్ అచ్యుత వెంకట సుధాకర్ చెప్పారు. మండల కేంద్రమైన ఈపూరు ఆర్బికేలో గ్రామ రెవెన్యూ అధికారులు,ఆర్బికే సిబ్బందికి అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. బృందాలు క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి పంట నష్టం వివరాలను నమోదు చేయాలన్నారు. సామాజిక తనిఖీ అనంతరం చివరి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఏవో రామారావు మాట్లాడుతూ తుఫాను గాలుల తీవ్రతతో దెబ్బతిన్న పంటలను సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించగా వరి 385 హెక్టార్లు, శనగ 847 హెక్టార్లు, మొక్కజొన్న 198 హెక్టార్లు,మినుము 15 హెక్టార్లు,పొగాకు 10 హెక్టార్ల లో పంట దెబ్బ తిన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాల మేరకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంట నష్ట నివారణ సాధ్య పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఒ నాగ శ్రీనివాసరావు, ఎఇఒ అప్పారావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ అచ్యుత వెంకట సుధాకర్

'విద్యార్థి మేలుకో.. భవిష్యత్తు కాపాడుకో' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థులకు వైసిపి ఇచ్చిన హామీల అమలులో జరిగిన అన్యాయంపై యువత, నిరుద్యోగులలో చైతన్యం తీసుకురావాలని టిఎన్ఎస్ ఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కూరపాటి హనుమంతరావు పిలుపునిచ్చారు. 'టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థి మేలుకో భవిష్యత్ కాపాడుకో' వాల్ పోస్టర్‌ను శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆవిష్కరించారు. హనుమంతరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా అంటూ విద్యార్థులను రెచ్చ గొట్టి తీరా అధికారంలోకి వచ్చాక మాట తప్పి మడమ తిప్పారని విమర్శించారు. అరవిందబాబు మాట్లాడుతూ విద్యార్థి లోకానికి జగన్ రెడ్డి చేసిన మోసాలపై అవగాహనా ర్యాలీలు, సదస్సులు, సమావేశాలు నిర్వహించి విద్యార్థులందరినీ ఏక తాటిపై తీసుకు రావాలన్నారు. విదేశీ విద్య, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ను నిర్వీర్యం చేసి ఇటువంటి పథకాలను పట్టించుకోకపోవడంతో బీసీ,ఎ స్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు విద్యను దూరం చేశారన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కె.కోటిరెడ్డి, సీని యర్ నాయకులు కె. బ్రహ్మయ్య, నరసరావుపేట నియోజకవర్గం అధ్యక్షులు యేనుగంటి భార్గవ్ సాయి, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వీరయ్య, కార్యదర్శి పఠాన్ అబ్దుల్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి షేక్. కరిముల్లా, నియోజకవర్గ నాయకులు బాలాజీ, సూర్య, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అరవిందబాబు తదితరులు

రైతులకు భరోసా ఇవ్వని ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తుపాను ప్రభావం వలన పల్నాడు ప్రాంతంలో పంట నష్ట పోయిన రైతులకు వైసిపి ప్రభుత్వం ఎటువంటి భరోసా కల్పించలేదని, కనీసం నష్టంపై అంచనాలు కూడా సిద్ధం చేయ లేక పోయారని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటివరకు పంట నష్టంపై పరిశీలన చేయకుండా నివేదికలు కేంద్రానికి ఎందుకు పంపడం లేదని ప్రశ్నించారు. గడిచిన నాలుగేళ్లలో గురజాల నియోజకవర్గంలో ఏ గ్రామంలోనైనా పంట కాల్వలకు మరమ్మతులు చేశారా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో బైపాస్ పూర్తి చేస్తానని చెప్పిన మహేష్ రెడ్డి ఎన్నికలకు మరో మూడు నెలల సమయం ఉన్నప్పటికీ ఇప్పటికీ పూర్తి చేయ లేక పోయారన్నారు. ఓట్ల సర్వేలో ఎటువంటి అవకతవకలు జరిగిన అధికారులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

నాణ్యమైన పంటతో అధిక ఆదాయం

ప్రజాశక్తి -ముప్పాళ్ల

మండలంలోని నార్నెపాడులో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పలు రకాల పంటలను రైతు సాధికార సంస్థ ఈడి శామ్యూల్ ఆనంద్,ప్రకృతి వ్యవసాయ పల్నాడు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమల కుమారి శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా శామ్యూల్ ఆనంద్ మాట్లాడుతూ ఏ గ్రేడ్ విధానంలో ఒక ఎకరా విస్తీర్ణంలో ఐదు రకాల పంటలు వేసుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. అదేవిధంగా ఎటిఎం మోడల్ లో మల్లి రకాల పంటల నుంచి మంచి ఆదాయం పొందవచ్చని అన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న కలెక్టర్, చిత్రంలో జెసి, ఆర్‌డిఒ

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆరోగ్య ఖర్చుల నిమిత్తం సహాయం కోరిన వృద్ధురాలికి జిల్లా అభివృద్ధి నిధుల నుండి లక్ష రూపాయలను జిల్లా కలెక్టర్ ఆమెకు అందజేశారు. చిలకలూరిపేటకు చెందిన నంబూరు నాగ సత్యవాణి, భర్త శివప్రసాద్ ,చిన్న కుమార్తె అనారోగ్యంతో చనిపోయారని, వితంతువైన పెద్ద కుమార్తె తన వద్దనే ఉంటోందని చెప్పారు. తనకు ఆరోగ్య రీత్యా ఆర్థిక సాయం అందించాలని కలెక్టర్ కు విన్నవించుకుంది. దీనిపై స్పందించిన కలెక్టర్ ఈ ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ కార్యాలయంలోని మీడియా పాయింట్ వద్ద ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ. శ్యాం ప్రసాద్ జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం తపాల్గొన్నారు.



రొంపిచర్లలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండల కేంద్రమైన రొంపిచర్లలో శుక్రవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరవగా ఆయనుకు పాస్టర్లు, స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సెమీక్రిస్మస్ కేక్ ను కట్ చేశారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షులు పడాల శివారెడ్డి, వైసిపి నాయకులు గుండాల వెంకటేష్, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఆంధ్ర ఎం ఆర్ పియస్ వ్యవస్థాపక అధ్యక్షులు కాలవ రవి పాల్గొన్నారు.



ముప్పాళ్ల జెడ్‌పి పాఠశాలలో ట్యాబ్‌లు స్వీకరిస్తున్న విద్యార్థులు

ప్రపంచ వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని ప్రత్యేక అవసరాలు గల విద్యావనరుల కేంద్రంలో వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మండల విద్యాశాఖాధికారులు ఒంగోలు రాజు, యమ్.సీతారామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమాజంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను, వికలాంగులను చిన్నచూపు చూడొద్దని చెప్పారు. వారికి విద్యా రంగంలో సమాన అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా వారికి ట్యాబ్‌లు అందజేశారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులలో ప్రతిభ గల వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో జడ్‌పిహెచ్ఎస్ హెచ్ఎం.నాగేంద్రమ్మ, ఎన్‌సిసి అధికారి సాయి జగన్నాథరావు, ఐఇడి టీచర్లు పి.అర్జున్, ఎ.శ్రీలత, వి.రాజేష్, సిఆర్‌పి ఉదయలక్ష్మి పాల్గొన్నారు

వైసిపి ప్రభుత్వంలో సర్పంచుల వ్యవస్థ నిర్వీర్యం

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మల్కైన పంచాయతీ సర్పంచులు ఈ వైసీపీ ప్రభుత్వంలో తమకు నిధులు కావాలని రోడ్డెక్కి ఆందోళనకు దిగడం ప్రభుత్వం సిగ్గుపడాల్సిన విషయమని ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. శుక్రవారం మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో అభివృద్ధికి సర్పంచుల సమర శంఖారావం పేరిట ఏపీ సర్పంచుల సంఘం, ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తాజా, మాజీ సర్పంచ్‌లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ లు ఎంపీపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కల్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీలకు వచ్చిన 14, 15 ఫైనాన్స్ నిధులు దారి మళ్లించి పంచాయతీల అభివృద్ధిని నిర్వీర్యం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులు ఇవ్వకుండా పంచాయతీ సర్పంచులను ఉత్సవ విగ్రహాల మార్చివేసిందని విమర్శించారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు కనీస వేతనం రూ. 15 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమకు నిధులు కావాలని పదేపదే ఢిల్లీ చుట్టూ తిరుగుతున్న సిఎంకు సర్పంచుల బాధలు, ఆందోళనలు కనబడకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో సర్పంచుల పరిస్థితి వాలంటీర్లకన్నా దిగువస్థాయిలో ఉందని అన్నారు. రాజ్యాంగ ప్రకారం



ఎన్నికైన సర్పంచులకు కనీస హక్కులు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నుండి చట్ట ప్రకారం వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకుంటోందని తెలిపారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. సర్పంచులు కూడా పంచాయతీల్లో ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు.



మాట్లాడుతున్న చాంద్‌బాషా

ఉద్యోగులు, పెన్షనర్లకు ఐఆర్ 29 శాతం ప్రకటించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ఈనెల 11న జరిగే రాష్ట్ర క్యాబినెట్‌లో ఐఆర్ 29 శాతం ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఎపిజిఇఎ) జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా కోరారు. శుక్రవారం నగరంపాలెంలోని అసోసియేషన్ కార్యాల యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేసిన 5 నెలలు కావస్తున్నా ఇంత వరకూ ఐఆర్ ప్రకటన చేయకపోవటం శోచనీయం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించిన ఐఆర్ ప్రకటించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, ఉపాధ్యక్షులు కె.రవికుమార్, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, నగర సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరిముల్లా షాఖాదరి తదితరులు పాల్గొన్నారు.



ఆదుకోవాలని తహశీల్దార్‌కు రైతులు వినతి

ప్రజాశక్తి - తాడికొండ

మీచౌంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తాడికొండకు చెందిన రైతులు స్థానిక తహసీల్దార్ ఫణీంద్ర బాబు కు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. తుపాను కారణంగా పత్తి, వరి, మినుము మొదలైన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుండి పంటల వివరాలను సేకరించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పంట నష్టాన్ని అంచనా వేయటం జరుగుతుందన్నారు. అక్కదేవతల చెరువులో భూములు సాగు చేసుకుంటున్నా దళితులకు కూడా న్యాయం జరిగే విధంగా అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు.

చలపతి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థులు 18 మంది ప్రముఖ బహుళజాతి సంస్థ కొరిజో కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళశాల చైర్మన్ వై.వి.ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం ఆయా విద్యార్థులను కళాశాల ప్రాంగణంలో అభినంది ంచారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బహుళ జాతి కంపెనీలలో ఎంపిక అవటానికి శిక్షణ తరగతులు క్రమం తప్పకుండా నిర్వహస్తున్నామని, తద్వారా వారు ప్రాంగణ ఎంపికల్లో సత్తా చాటుతున్నారని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్ మాట్లాడుతూ రూ.4 లక్షల వార్షిక వేతనంతో విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో కళాశాల శిక్షణాధికారి డాక్టర్ వై.రాకేష్‌కుమార్, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

పోలీసు కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీసు శాఖలోపనిచేస్తూ ఇటీవల వేర్వేరు ప్రాంతాల్లో అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్, పోలీసు కానిస్టేబుల్స్‌కు ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున మొత్తం మూడు లక్షల చేయూత చెక్కులను జిల్లా ఎస్పి ఆరిఫ్ హాఫీజ్ శుక్రవారం సంబంధిత కుటుంబ సభ్యులకు అందచేశారు. ఆర్మడ్ రిజర్వులో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేసిన మాధవస్వామి, ఫిరంగిపురం పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా పనిచేసిన ఎస్ రాజేష్, కొత్తపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన కిషోర్ కుటుంబ సభ్యులకు చెక్కులు అందించారు. జిల్లా క్రైమ్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆరోగ్య రాజు, వైస్ ప్రెసిడెంట్ ఆర్ఐ రాజారావు, కరిముల్లా, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.





శివాలయంలో కార్తీక పూజలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తీకమాస ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక శివ భక్త భజన బృందం ఆధ్వర్యంలో శుక్రవారం శివనామ అర్ధ ఏకాహం ప్రారంభించారు. మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, శ్రీమతి అనిత దంపతులు అఖండ దీపాన్ని వెలిగించి, కలశ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవస్థానం ముఖ మండపంపై శివనామ అర్ధ ఏకాహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ శ్రీమతి నేరెళ్ళ లక్ష్మి రాధిక, భజన భక్త బందం ప్రతినిధులు పణిదపు వీర రాఘవయ్య, నాగమయ్య, గోవిందు, వెంకటేశ్వరరావు, శివమ్మ, ప్రసాదు, సుబ్బమ్మ పాల్గొన్నారు.

వేదసీడ్స్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక నెహ్రూనగర్‌లోని కోదండ రామాలయంలో వేద సీడ్స్ ఆధ్వర్యంలో దీక్ష స్వీకరించిన స్వాములకు ఏర్పాటు చేసిన చద్ది కార్యక్రమాన్ని శుక్రవారం ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని చెప్పారు. నగరంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమాలకు దాతల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాలను మహా యజ్ఞంలా భావించి అన్ని చోట్ల విజయ వంతంగా నిర్వహిస్తున్నారన్నారని తెలిపారు. కార్యక్రమంలో అయిశెట్టి శ్రీనివాసరావు, బండి రామ ప్రభు, యర్రగోపు నాగేశ్వరరావు, మరియు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లి

ధన్వంతరీ జయంతి సందర్భంగా శనివారం ఉదయం 9 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని కీర్తి ఎస్టేట్స్‌లోని శ్రీ సురక్ష ఆయుర్వేద, యోగా అకాడమీలో మోకాళ్ల నొప్పులు, అరుగుదల రోగులకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ సురక్షా అకాడమీ చైర్మన్ డాక్టర్ కొండా మాణిక్యేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ సురక్ష పంచకర్మ సీనియర్ వైద్యులు, నాడీ వైద్య నిపుణులు కొండా పూర్ణ రాజేశ్వరి రోగులకు ఉచిత కన్సల్టేషన్, వ్యాధి నిర్ధారణ చేస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆరోగ్యంగా జీవించాలని ఆయన కోరారు.

రాజధాని రైతులకు ప్లాట్లు కేటాయింపు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని నిర్మాణానికి లాండ్ పూలింగ్ లో భూములు ఇచ్చిన రైతులకు కేటాయించిన 2,243 ప్లాట్ల లో కొన్ని ప్లాట్లు లాండ్ పూలింగ్ పరిధిలో లేని భూముల్లో, మరికొన్ని భూ సేకరణ పూర్తి కాని భూముల్లో ఉన్నట్లు గుర్తించడం జరిగిందని సి ఆర్ డి ఎ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారికి ప్రత్యా మ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు మొదట విడతలో 679 మంది రైతులకు వారి అంగీ కారము కోరుతూ ఇప్పటికే నోటీసులు జారీ చేయటమైనదని వెల్లడించింది. రెండవ పర్యాయము నోటీసులు జారీ చేయగా ఇప్పటి వరకు 44 మంది రైతులు ప్రత్యామ్నాయ ప్లాట్లు పొందుటకు అంగీకారము తెలిపారని,44 మంది రైతులకు లాటరీ ద్వారా ఈ నెల 15 వ తేదీన ప్లాట్లు కేటాయించడం జరుగుతుందని సి ఆర్ డి ఎ కమిషనర్ పేర ప్రకటన విడుదలైంది. విజయవాడ గవర్నరుపేటలోని సి ఆర్ డి ఎ కార్యాలయములో ఈ- లాటరీ విధానం ద్వారా ప్లాట్లు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు.



వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజలు తమ జీవన ప్రమాణాలు మెరుగుపరచుతారనే ఆకాంక్షతో అధికారన్నీ అప్పగిస్తే, వాటిని గాలికి వదిలేసి అహంకారంతో విర్రవీగేవారికి తెలంగాణ ప్రజలు గట్టి బుద్ధి చెప్పారని ఇదే రీతిలో సిఎం జగన్‌కు కూడా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని టిడిపి పశ్చిమ నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు 43వ డివిజన్ లోని సుగాలి కాలనీ లో బాబు ష్యూరీటి - భవిష్యత్తు కు గ్యారెంటీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ప్రజలు వైసిపి ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉన్నారని అన్నారు. ప్రజలు పసిగట్టారని, కుడిచేతితో ఇచ్చి, ఎడమ చేతితో లాక్కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు.టిడిపి నాయకులు జమ్ముల వీరాంజనేయులు ,కొమ్మినేని కోటేశ్వరావు,మద్దిరాల మ్యాని,మానం పద్మ శ్రీ, నెల్లూరి సాయి కష్ణ, ఉమ్లా నాయక్, మట్టిపూడి శివన్నారాయణ, శివ బ్రహ్మం , కిలారి ఆదినారాయణ, హరిజా నాయక్,పేరయ్య, శేషగిరిరావు పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు చేయాలి

ఇప్పటంలో దెబ్బతిన్న అరటి తోటను పరిశీలించిన టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



మిచౌంగ్ తుపాను ప్రభావంతో ఎంటీఎంసీ పరిధిలోని ఇప్పటం గ్రామంలో దెబ్బతిన్న అరటి, వరి పంట పొలాలను శుక్రవారం టీడీపీ, జనసేన ఇప్పటం గ్రామ పార్టీల అధ్యక్షులు శంకర్ శెట్టి పిచ్చయ్య, సాదు కొండలరావు, ఆధ్వర్యంలో టీడీపీ తెలుగు రైతు గుంటూరు జిల్లా అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన, పార్టీల తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, సామలనాగేశ్వరరావు పర్యటించారు. ఈ సందర్భంగా తెలుగు రైతు గుంటూరు జిల్లా అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం వల్ల వరి తో పాటు పలు రకాల వాణిజ్య పంటలు పెద్ద ఎత్తున దెబ్బ తిన్నాయని అన్నారు. వేలాది ఎకరాల్లో వరి కోతలు కోసి పొలాల్లో ఉంచగా, మరి కొంత వరి కోతకు సిద్ధంగా ఉందని అన్నారు. తుపాన్ కారణంగా అరటి తోట మొత్తం నేలమట్టం అయిందని, ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు చేసి, బాధిత రైతులను ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదుకోవాలన్నారు. ఎకరానికి రూ.1 లక్షల చొప్పున నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలుగుదేశం తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, సామల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్‌బికెల్లో వ్యవసాయ యంత్రాలు అందుబాటులో ఉంటాయని చెబుతున్నప్పటికీ ఆచరణలో ఎక్కడా లేవని అన్నారు. యంత్రాల అందుబాటులో ఉంటే సగానికి పైగా పంట నూర్పిడి సకాలంలో చేసుకునే వారన్నారు. ధాన్యం కప్పు కోవడానికి, పట్టాలు సరఫరా కూడా ప్రభుత్వం నిలిపేసిందని రైతులు ఆవేదన చెందు తున్నారని చెప్పారు. తక్షణం ప్రభుత్వం దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసి పంటల బీమా, పెట్టుబడి రాయితీ, పరి హారాన్ని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం చెల్లిం చాలని, తుపాన్ సహాయక చర్యలు చేప ట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలోతెలుగు రైతు నియోజకవర్గ అధికారప్రతినిధి అక్కినేని సుబ్రహ్మణ్యం, తెలుగుదేశం సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన్ రావు,జనసేన పార్టీ కాపు సంక్షేమ సేన నియోజకవర్గ అధ్యక్షులు తిరుమల శెట్టి కొండల రావు, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, ఎంటీఎంసీ అధ్యక్షులు మునగపాటి మారుతీ రావు, ఎంటిఎంసి ఉపాధ్యక్షులు సాధు చంద్రశేఖర్,తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి గంజి రమేష్, తిరుమల శెట్టి శ్రీధర్ యువజన అధ్యక్షులు తిరుమల శెట్టి నరసింహారావు,తాడేపల్లి టౌన్ యువజన అధ్యక్షులు సింగంశెట్టి వెంకట్,సీనియర్ జనసైనికుడు బొడ్డు మధు, జెముడుగాని మహేంద్ర, తమ్మా శంకర్ రెడ్డి, బొబ్బా రవి తేజా, తురక నరేష్ పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-గుంటూరు లీగల్ : గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాల్లో ఆదివారం జాతీయ లోక్అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయసేవాధికారి సంస్థ జిల్లా చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిఎస్బిజి పార్థసారథి తెలిపారు. ఈ జాతీయ లోక్అదాలత్లో గుంటూరు జిల్లా వ్యాప్తంగా 37 లోక్ అదాలత్ బెంచెస్ ఏర్పాటు చేయటం జరిగిందని, వీటి ద్వారా సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో వారు ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం రాజీ పడదగ్గ ఎక్సైజ్ కేసులు, మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, నాూఉూ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించటం జరుగుతుందన్నారు. కక్షిదారులు, పోలీస్వారు, స్టేక్ హోల్డర్లు అందరు ఈ జాతీయ లోక్ అదాలత్లో ఎక్కువ కేసులు పరిష్కరించేలా సహకరించాలని కోరారు.



సదస్సుకు హాజరైన వివిధ కంపెనీల ప్రతినిధులు

కొత్త ఐడియాలతోనే జీవితంలో మార్పు

ప్రజాశక్తి-గుంటూరు

జీవితంలో ఎవరైనా అభివృద్ధి చెందాలనుకుంటే కొత్త ఐడియాలతోనే సాధ్యమని విజయవాడలోని ఎస్టీపీఐ జాయింట్ డైరెక్టర్ బి.వినయ్ కుమార్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇంకుబేటర్ వారు న్యూఢిల్లీలోని డీఎస్టీ ఆర్థిక సహాయంతో ' వీఐఐఐఎస్ఏ (విజ్ఞాన్స్ ఇన్నోవేషన్, ఇగ్నిషన్ అండ్ ఇంకుబేషన్ ఫర్ స్టార్టప్ యాక్సిలరేషన్) టెక్నాలజీ బిజినెస్ ఇంకుబేటర్ స్టార్టప్ ఫండింగ్ ఏంజెల్ ఇన్వెస్టర్స్ అండ్ వెంచర్ క్యాపటలిస్ట్స్) సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సుకు 12 రాష్ట్రాల నుంచి ఎంపికచేసిన 30 స్టార్టప్ కంపెనీలు హాజరు కాగా, ఆయా కంపెనీలు ప్రారంభించాలనుకుంటున్న వివిధ రకాల స్టార్టప్ కంపెనీల ఐడియాలను ఈ సదస్సులో తెలియజేశారు.బి.వినయ్ కుమార్ మాట్లాడుతూ సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు వచ్చే వారికి ఎల్లప్పుడు ఆర్థిక తోడ్పాటును అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎవరికైనా కొత్త ఐడియాలు ఉంటే వాటిని వెంటనే అభివద్ధి చేసి మార్కెట్లోకి విడుదల చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివద్ధితోనే జీవితంలో మంచి ఉపాధి, ఉన్నత స్థానాలను పొంద గలరన్నారు. సదస్సులో విజయవాడలోని ఎస్టీపీఐ డెప్యూటీ డైరెక్టర్ డీ.కిరణ్ కుమార్ సద్గురు క్యాటలైజర్స్ సీఈవో పీ.గోపాలక్రిష్ణ, ఎండియా పార్టనర్స్ వెంచర్ క్యాపటలిస్ట్ రాఘవగుప్త, సక్సీడ్ వెంచర్స్ ఏంజల్ ఇన్వెస్టర్ రుతిక్ జాదవ్, హైదరాబాద్ ఏంజల్స్ బోర్డ్ మెంబర్ సుబ్బారావు నీలంరాజు, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తదితరులు ప్రసంగించారు.

డాక్టర్ అనితను సన్మానిస్తున్న వైవి ఆంజనేయులు, తదితరులు



ఫార్మా రంగంలో దేశానికి ప్రత్యేక స్థానం

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో 'ఇన్నోవేట్ టు ఎలివేట్ : ఎ జర్నీ ఇన్టూ నావెల్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్' ఫర్ పార్మసీ స్టూడెంట్స్ అనే అంశంపై రెండ్రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. హైదరాబాద్ బయోఫోర్ ఇండియా ఫార్మాస్యూటికల్స్, సిండి ఫార్మా, విజె ఇన్స్ట్రుమెంట్స్, ఐవివై ఓవర్సీస్, లియో ఓవర్సీస్ సహకారంతో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జి.అనిత, హైదరాబాద్ బయాలజికల్ ఈ లిమిటెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ధర్మేష్ పటేల్, చలపతి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ వై.వి.ఆంజనేయులు హాజరయ్యారు. చలపతి సొసైటీ కార్యదర్శి వై.సుజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ అనిత మాట్లాడుతూ భారత దేశం పార్మా రంగంలో ప్రపంచ స్థాయిలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని, ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి తర్వాత మన దేశంలో పార్మా రంగం వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. నైతిక విలువలకు పట్టం కడుతూ నాణ్యమైన మందుల ఉత్పత్తి, సరఫరాతోపాటు పేషెంట్ కౌన్సిలింగ్ వరకూ వివిధ రంగాలలో మన దేశం దూసుకుపోతుందన్నారు. అంతేకాకుండా మన దేశం ఫార్మా హబ్గా ఎదగటంతోపాటు నానాటికి విస్తృతమవుతున్న వ్యాధుల్ని వాటి నివారణకు సంబంధించిన పరిశోధన, కొత్త మందుల తయారీ మొదలైన అంశాల్లో యువ శాస్త్రవేత్తలు, ఫార్మాశిస్టల అవసరం ఉంటుందన్నారు. కావున ప్రతి విద్యార్థి నైపుణ్యాలను, జ్ఞానాన్ని రోజురోజుకూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా పెంపొందించుకోవాలని అన్నారు. ధర్మేష్ పటేల్ మాట్లాడుతూ ఈ నావెల్ డ్రగ్ డెలివరీ సిస్టమ్ ద్వారా కొత్త పరమాణవుల ఆవిష్కరణ ప్రక్రియ నుండి నూతన ఔషదాలను కనుగొనటం ద్వారా ఎన్నో వ్యాధులకు సత్వర చికిత్స అందివచ్చు వచ్చున్నారు. సభలో ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు మాట్లాడారు. ఈ సందర్భంగా చలపతి పార్మసీ కళాశాల లియో గ్లోబల్ ఓవరీస్ వారితో పరస్పర ఒప్పందం కుదుర్చుకుంది.

18 ఏళ్లు నిండిన వారంతా ఓటు కలిగి ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు భారత రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కుపై పౌరులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా జిల్లాలోని స్వీప్ నోడల్ ఆఫీసర్లు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, విద్యార్థులతో యువ ఓటర్ల నమోదు కార్యక్రమంపై స్థానిక కలెక్టరేట్ నుండి రమేష్ హాస్పిటల్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రమేష్ ఆసుపత్రి కూడలి వద్ద మానవ హారంగా ఏర్పడి ఓటు హక్కుపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం స్పెషల్ సమ్మరీ రివిజన్ జరుగుతుందని, ముఖ్యంగా ఈ సంవత్సరం జరిగే సమ్మరీ రివిజన్ ప్రత్యేకత ఏమిటంటే 2024 మార్చి, ఏప్రిల్ మాసాలలో లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయన్నారు. కావున 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కోరారు. 18 ఏళ్లు నిండిన వారుగానీ, 2024 జనవరి1కి 18 ఏళునిండబోతున్నవారు, అలాగే ఏప్రిల్ 1, జులై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండబోతున్న వారినీ (ప్రాస్పెక్ట్) ఓటర్లుగా నమోదు చేయటం ప్రధాన ఉద్దేశం అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా కీలకమని, కావున ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఈ ర్యాలీలో డిఆర్ఓ కె.చంద్రశేఖర్రావు, వికలాంగుల, వయో వద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సి.హెచ్ సువార్త, డ్వామా పి.డి వెంకటశివరామిరెడ్డి, గ్రౌండ్ వాటర్ ఎ.డి వందనం, జిఎంసి అడిషనల్ కమిషనర్ శివ జ్యోతి పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, జెసి తదితరులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

మరమ్మతుల దృష్ట్యా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడికొండూరు మండలంలో అన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, గుంటూరులోని ఆర్టిసి కాలనీ, ఎఎస్ కృష్ణా కంపెనీ రోడ్డు, మానస సరోవరం, షాపు ఎంప్లాయీస్ కాలనీ, నంది వెలుగు రోడ్డు, విజయవాడ రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. గుజ్జనగుండ్ల సబ్ స్టేషన్ పరిధిలో పలకలూరురోడ్డు, కృష్ణబాబు కాలనీ, మారుతీ నగర్, నాయిబ్రాహ్మణ కాలనీ, ఎస్విఎన్కాలనీ, తారకరామా నగర్, నేతాజి నగర్, వైష్ణవి నగర్, నందవనం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. అలాగే సబ్స్టేషన్ మరమ్మతుల వల్ల విద్యానగర్ , గుజ్జనగుండ్ల, పట్టాభిపురం, జెకెసి కళాశాల రోడ్డు తదితర ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఆటోనగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు విద్యుత్నునిలిపివేయనున్నారు. అలాగే సబ్స్టేషన్ నిర్వహణ పనుల వల్ల కృష్ణనగర్, అశోక్నగర్, చంద్రమౌళీనగర్, దేవాపురం, బ్రాడీపేట, లక్ష్మీపురం మెయిన్ రోడ్డు, పట్టాభిపురంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

జిఎంసిలో ఓటు అవగాహన కేంద్రం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరం లోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఓటర్లు ఈవిఎం, ఓటర్ వెరిఫికేషన్, పేపర్ ఆడిట్పై జిఎంసి ఏర్పాటు చేసిన అవగాహన కేంద్రా లను సద్వినియోగం చేసుకోవా లని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈ.ఆర్.ఓ. కీర్తి చేకూరి తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కేంద్రాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవిఎం), ఓటర్ వెరిఫికేషన్, పేపర్ ఆడిట్పై అవగాహన కల్గించడానికి జిఎంసి ప్రధాన కార్యాలయం, బందావన్గార్డెన్స్లోని సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.ఓటర్లు ఈ కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. అలాగే ఓటర్లు తమ ఓటుకు సంబంధించిన ఏ సందేహం ఉన్నా తీర్చడానికి వీలుగా నగరపాలక సంస్థ ప్రదాన కార్యాలయంలో హెల్ప్డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. తూర్పు నియోజకవర్గానికి 0863-2345104, పశ్చిమ నియోజకవర్గానికి 2345105 నంబర్లను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా ఆపరేటర్లను నియమించామన్నారు. ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:30 గంటలలోపు ఫోన్చేసి తమ ఓటుకి సంబంధించి ఏ సందేహం ఉన్నా తెలుసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఈ.ఆర్.ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీశివజ్యోతి, ఏఈఆర్ఓలు సి,హెచ్. శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, మేనేజర్ శివన్నారాయణ పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్

సచివాలయాలను సందర్శించిన జెసి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి శుక్రవారం గుంటూరు పశ్చిమ మండలంలోని వెంగళాయపాలెం, చల్లావారిపాలెం సచివాలయాలను సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం కోసం అన్లైన్లో రిజిస్ట్రేషన్లు సచివాలయాల స్థాయిలో సిబ్బంది ఏ విధంగా చేస్తున్నారో ఈ సందర్భంగా జెసి పరిశీలించారు. క్రీడల వారీగా ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ క్రీడలకు సంబందించి రిజిస్ట్రేషన్లు, జట్ల కూర్పును ఏ విదంగా చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. క్రికెట్, ఇతర క్రీడలకు సంబందించి పురుషులు, స్త్రీల జట్లను రిజిష్టర్ చేయాలని, అలాగే ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ క్రీడలకు సంబంధించి వాలంటీర్ల సహాయంతో క్రీడల్లో ఉత్సాహంగా ఉన్న వారిని గుర్తించి, వారిని రిజిష్టర్ చేయాలని సిబ్బందికి తెలియజేశారు. క్రీడా ప్రాంగణములో ప్రాథమిక వైద్య కిట్లను, మెడికల్ స్టాలును ఏర్పాటు చేయాలని, రిజిస్ట్రేషన్లు నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఎస్.ఆదినారాయణరావు, ఇఒపిఆర్డి కె.శ్రీనివాసరావు, వెంగళాయపాలెం, చల్లావారిపాలెం సర్పంచ్లు ఎన్.లలితకుమారి, ఆరుదల సాంబశివరావు, కార్యదర్శులు సచివాలయ సిబ్బందితదితరులు పాల్గొన్నారు.



సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న జెసి

విఐటి విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద రోగుల కోసం విఐటి విద్యార్థులు సామాజిక దక్పధం తో రక్త దానం చేయడం అభినందీయమని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. వేలూరులోని విట్ విద్యా సంస్థల ఛాన్సలర్ విశ్వనాథన్ జన్మదినం సందర్భంగా తుళ్లూరు మండలం వెలగపూడి లోని విఐటి విద్యార్థులు శుక్రవారం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రక్త దానం చేసారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక దక్పధం మరింతగా పెరిగి పేదవారిని ఆదుకోవాలన్నారు. విద్యార్థుల ఆలోచనల్లో ఎలాంటి గ్రూపులు ఉండవని కేవలం రక్తం లో మాత్రమే గ్రూపులు ఉంటాయని ఆయన చెప్పారు. సాటి మనిషిని ఆదుకునేందుకు, పేద రోగుల కోసం రక్తదానం చేసేందుకు విద్యార్థులు ముందుకు వచ్చారని ఆయన చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రికి మూడు వేల నుంచి నాలుగు వేల మంది రోగులు వస్తున్నారని వారికి రక్తం ఎంతో అవసరం ఉందని ఆయన చెప్పారు. ముఖ్యంగా బైపాస్ ఆపరేషన్, క్యాన్సర్ రోగులకు కణితి తొలగించడానికి రక్తం ఎంతో అవసరమవుతుందని ఆయన చెప్పారు. విద్యార్థులు ఇచ్చే రక్తం ఎంతో మంది ప్రాణాలను కాపాడేందుకు అవకాశం కలుగుతుందని ఆయన అన్నారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీల విషయం లో ఆపరేషన్ జరిగే సమయం లో రక్తం అవసరం అవుతుందని ఆ యన తెలిపారు. విఐటి యూనివర్సిటీ విద్యార్థులు చేస్తున్న ఈ కార్యక్రమం బహత్తరమైందని ఆయన చెప్పారు. రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె సురేష్ వి ఐ టి వైస్ ఛాన్సలర్ డాక్టర్ యస్ వి కోటారెడ్డి యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్, ఇంద్రగంటి సత్యనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

